# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

ఆదివారం | 17 ఆగస్టు 2025 | పేజీలు 8




# నా గెలుపే ప్రత్యర్థులకు దుఃఖం



**హైదరాబాద్ పెన్ పవర్:**'ఎవరినీ శత్రువుగా చూడను.. నేను ఎవరిరైనా అలా చూడాలంటే వారికి ఆ స్థాయి ఉండాలి' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 2006లో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని.. దాదాపు 17 ఏళ్ల తర్వాత రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యానని తెలిపారు. ప్రముఖ కవి అందెశ్రీ ప్రచురించిన 'హసిత భాష్పాలు' పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. పుస్తక రచయిత శ్రీరామ్ పాలమూరు బిడ్డ కావడం చాలా సంతోషంగా ఉందని సీఎం అన్నారు. గూడ అంజయ్య, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న లాంటి కవులు తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తి నింపారని సీఎం కొనియాడారు.

"తెలంగాణ ప్రజలు నాపైన పెద్ద బాధ్యత పెట్టారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని వారి అభ్యున్నతి కోసం ఉపయోగిస్తా. నాకు నచ్చని వారిపై అధికారాన్ని ఉపయోగించే మూరు?డిని కాదు. నా గెలుపే ప్రత్యర్థులకు దుఃఖం. నేను సీఎంగా సంతకం పెట్టడం ప్రత్యర్థుల గుండెలపైన గీత పెట్టినట్లు అయ్యింది. 109 దేశాల నుంచి వచ్చిన సుందరీమణులతో జయ జయహే తెలంగాణ గీతం పాడించాం. ఇంత కంటే ఇంకా ఏం కావాలి? భవనాలు ఎవరైనా కడతారు. అద్దాల మేడలు, రంగుల గోడలు అభివృద్ధి కాదు. పేదలు ఆత్మగౌరవంతో తలెత్తుకోవడమే

-మిగతా 2లో

# కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు

## జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

- ప్యాకేజీ తీసుకుని స్క్రిప్ట్ చదువుతారంటూ జగ్గారెడ్డి తీవ్ర ఆరోపణ
- ప్రతి పార్టీలోనూ కోవర్టులు ఉండటం సహజమని వ్యాఖ్య
- రాజగోపాల్ రెడ్డిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలని రాజకీయ వర్గాల్లో చర్చ



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత పార్టీలోనే బీజేపీ కోవర్టులు ఉన్నారంటూ సంచలన ఆరోపణలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొందరు -మిగతా 2లో

# తెలంగాణలో భారీ వర్షాలు..

# అందుబాటులోకి టోల్ ఫ్రీ నెంబర్

- సహాయక చర్యలకు వీలుగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఈఎన్‌సీ కార్యాలయంలో ప్రత్యేక ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ప్రతి సర్కిల్ స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు,
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు






**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ, అత్యంత భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా -మిగతా 2లో

# నాగార్జునసాగర్ కు జలకళ...

## భారీగా తరలివస్తున్న పర్యాటకులు



- నాగార్జున సాగర్‌కు భారీగా పెరిగిన వరద ప్రవాహం
- 5 అడుగుల మేర 20 క్రస్ట్ గేట్ల ఎత్తివేత
- దిగువకు 1.40 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- జలసౌందర్యాన్ని చూసేందుకు పోటెత్తిన పర్యాటకులు
- వారాంతం కావడంతో భారీగా సందర్శకుల రద్దీ
- ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:**వరుస సెలవులు రావడంతో నాగార్జున సాగర్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో జలాశయం నిండుకుండలా మారింది. అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడంతో, ఆ జలసౌందర్యాన్ని కళ్లారా చూసేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న దృశ్యాలను తమ కెమెరాలలో బంధిస్తూ, సెల్ఫీలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం అధికంగా ఉండటంతో, ప్రాజెక్టు అధికారులు శనివారం నాడు జలాశయానికి చెందిన -మిగతా 2లో

# పేలుళ్లు జరిగిన ప్రాంతాన్ని సీజ్ చేసి విచారణ జరపాలి

- కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా ఉంచారని విమర్శ
- 2023లో మేడిగడ్డ ఆనకట్ట వద్ద శబ్దాలు వినిపించాయని కేసు నమోదైందన్న ఆర్ఎస్పీ
- కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేదన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్ పెన్ పవర్:**2023లో మేడిగడ్డ ఆనకట్ట వద్ద శబ్దాలు వినిపించాయని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందని, పేలుళ్లు జరిగిన ప్రాంతాన్ని సీజ్ చేసి కారణాలపై విచారణ జరపాలని బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపయోగంగా ఉంచిందని ఆరోపించారు.మేడిగడ్డ ఆనకట్ట వద్ద శబ్దాలు వినిపించాయని 2023 అక్టోబర్ 21న సాయంత్రం 6.30 గంటలకు మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైందని గుర్తు చేశారు. అసాంఘిక శక్తులు ఉన్నాయని ఏఈఈ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదైందని వెల్లడించారు. అయినప్పటికీ కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సీబీఐ లేదా స్వతంత్ర్య దర్యాప్తు సంస్థతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



## నా గెలుపే ప్రత్యర్థులకు దుఃఖం

- మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి. రేషన్ కార్డులు, సన్నబియ్యంతో పేదల ఆత్మగౌరవాన్ని పెంచాం. వ్యక్తిగత ప్రయోజనాల కోసం నా పదవిని వాడను. పేదల కోసమే పని చేస్తా. తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే నా లక్ష్యం. ప్రపంచం గర్వించే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతా" అని సీఎం అన్నారు.

## నాగార్జునసాగర్ కు జలకళ...

## భారీగా తరలివస్తున్న పర్యాటకులు

- మొదటి పేజీ తరువాయి

20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర పైకి ఎత్తారు. దీని ద్వారా స్పిల్‌వే నుంచి సుమారు 1.40 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గేట్ల నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న కృష్ణా జలాలు కనువిందు చేశాయి.
పర్యాటకులు ఒకేసారి పెద్ద సంఖ్యలో వాహనాల్లో రావడంతో నాగార్జున సాగర్ డ్యామ్ వద్ద కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

## తెలంగాణలో భారీ వర్షాలు..

## అందుబాటులోకి టోల్ ఫ్రీ నెంబర్

- మొదటి పేజీ తరువాయి

కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర స్థాయిలో ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) కార్యాలయంలో ప్రత్యేకంగా ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. రహదారుల్లో ఇబ్బందులు, ఇంజనీరింగ్ సమస్యలు తలెత్తితే ప్రజలు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా 040 – 35174352 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి సర్కిల్ స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఉన్న కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో అత్యవసర పరిస్థితులు తలెత్తితే స్థానిక అధికారులు వెంటనే స్పందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలు కూడా ఎక్కడైనా రహదారులు దెబ్బతిన్నా, కల్వర్టులు కూలినా, గండ్లు పడినా వెంటనే సంబంధిత నెంబర్లకు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు

- మొదటి పేజీ తరువాయి

నేతలు ప్యాకేజీలు తీసుకుని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో కోవర్టుల వ్యూహం కొత్తేమీ కాదని, ప్రతి పార్టీలోనూ ఒకరిద్దరు ఇలాంటి వారు ఉండటం సర్వసాధారణమని జగ్గారెడ్డి అన్నారు. అయితే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోనే బీజేపీకి అనుకూలంగా పనిచేసే వారు ఉన్నారని ఆయన బాంబు పేల్చడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు పార్టీలో అంతర్గతంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. జగ్గారెడ్డి వ్యాఖ్యల వెనుక నిర్దిష్ట లక్ష్యం ఉందనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఉద్దేశించే ఆయన ఈ ఆరోపణలు చేసి ఉంటారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొంతకాలంగా రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ప్రభుత్వ పనితీరును లక్ష్యంగా చేసుకుని బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రేవంత్ రెడ్డిని ఇబ్బంది పెట్టే ప్రయత్నాలను అడ్డుకునేందుకే జగ్గారెడ్డి ఈ విధంగా స్పందించి ఉంటారని తెలుస్తోంది.

# ఈ 5 అలవాట్లుంటే ఫైనాన్షియల్ గా మీరు ఫిట్‌గా ఉన్నట్లే..!! తెలుసుకోండి..




హైదరాబాద్ పెన్ పవర్:నేటి కాలం యువతలో ఎక్కువ మంది సరైన ఆర్థిక ప్రణాళికలు లేకుండా లోన్స్, ఈఎంఐల ఊబిలో చిక్కుకుపోతున్నారు. లగ్జరీగా జీవించాలని చేస్తున్న కొన్ని ఆర్థిక తప్పులు ప్రస్తుతం పెరుగుతున్న ద్రవ్యోల్బణ కాలంలో అప్పుల భారాన్ని పెంచేస్తోందని ఫైనాన్షియల్ నిపుణులు అక్షత్ శ్రీవాస్తవ్ చెప్పారు. అయితే 2025లో ఐదు అలవాట్లు కలిగిన వ్యక్తి ఆర్థికంగా డబ్బును సమర్థవంతంగా మేనేజ్ చేస్తున్నాడని గుర్తించటానికి గుర్తుగా ఆయన వెల్లడించారు. ముందుగా అక్షత్ సేవింగ్స్ హ్యాబిట్ గురించి మాట్లాడారు. సంపాదిస్తున్న మొత్తంలో 20 శాతం ప్రతి నెల క్రమశిక్షణతో దాచుకోవటం ముఖ్యమన్నారు. సంపన్నుల్లో కూడా దాదాపు సగం మంది మాత్రమే సేవింగ్స్ విషయంలో ముందుకెళ్లగలుగుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అందుబాటు రేట్లలో ఇళ్లు తగ్గిపోవటంతో చాలా మంది నేటి కాలం యువత సొంత ఇంటి కలకు దూరంగా ఉంటున్నారని శ్రీవాస్తవ్ అన్నారు. దీర్ఘకాలంలో ఆర్థిక స్థిరత్వాన్ని సాధించటానికి సొంత ఇల్లు కలిగి ఉండటం చాలా ముఖ్యమని ఆయన చెప్పారు. ఇది భవిష్యత్తులో పెరిగే లివింగ్ ఖర్చులు ప్రధానంగా హెల్త్, ఫుడ్ వంటి వాటి నుంచి కొంద ఊరటను కలిగిస్తుందని చెప్పారు. అందుకే ఖచ్చితంగా సొంతిల్లు కలిగి ఉండాలన్నారు. ఇక అప్పులు చేయకుండా నేటి కాలంలో జీవించటం కష్టమే. కానీ అవి పరిమితికి మించకుండా ఉండేలా చూసుకోవటం ముఖ్యమని ఈఎంఐల భారం తగ్గించుకోవాలని శ్రీవాస్తవ్ చెప్పారు. మొత్తం సంపాదనలో ఈఎంఐలు 30 శాతం మాత్రమే ఉండాలని అప్పుడే ఆర్థికంగా బలంగా ఉన్నట్లు సూచించారు. ఇక ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా కలిగి ఉండాల్సింది ఎమర్జెన్సీ సేవింగ్స్. ప్రస్తుతం మీకు నెలకు అయ్యే ఖర్చులకు అనుగుణంగా కనీసం రెండేళ్ల పాటు జీవించటానికి సరిపడా డబ్బును కలిగి ఉండాలని శ్రీవాస్తవ్ చెప్పారు. అనుకోకుండా ఉద్యోగం పోయినా లేదా కొత్త కెరీర్ వైపు మారాలనుకున్నా అలాంటి సమయాల్లో ఇది ఆర్థికంగా కుటుంబాన్ని ముందుకు నడిపించటానికి సహాయపడుతుందని శ్రీవాస్తవ్ చెప్పారు. ఇక ఎంత సంపాదించినా కావాల్సింది దానిని ఎలా పెట్టుబడి పెట్టాలి, ఎక్కడ పెట్టుబడి పెట్టాలి, ఎన్నాళ్లు పెట్టుబడి పెట్టాలి వంటి జ్ఞానం కలిగి ఉండటం అంటారు శ్రీవాస్తవ్. కొన్నిసార్లు ప్రజలు సరైన అవగాహన లేకుండా చేసే పనులు వారిని పేదవారిగా మార్చేస్తుంటాయని హెచ్చరించారు. ఎక్కువ డబ్బు ఉన్నప్పుడు దానిని సరిగ్గా మేనేజ్ చేయలేకపోతే ఆ సంపద హరించుకుపోయే ప్రమాదం ఉందని అన్నారు.
పైన పేర్కొన్న పేరామీటర్స్ ఎవరైతే పాటిస్తున్నారో వారు ప్రస్తుతం ఆర్థికంగా బలంగా ఉండటంతో పాటు వీటిని కొనసాగిస్తే భవిష్యత్తులో కూడా ఆర్థికంగా ఫిట్ గా కొనసాగుతారని ఫైనాన్షియల్ అడ్వైజర్ శ్రీవాస్తవ్ వెల్లడించారు.

# ఇండ్లు ఆడుకునే బొమ్మల్లా కొట్టుకుపోయినయ్.. జమ్మూ కాశ్మీర్ బాధితులు




హైదరాబాద్ పెన్ పవర్:జమ్మూ కాశ్మీర్‌లోని కిష్త్వార్‌లోని చోసిటీ ప్రాంతంలో గురువారం క్లౌడ్ బరస్ట్ తో సంభవించిన వరదల్లో చనిపోయిన వారి సంఖ్య 60 కి చేరింది. మూడో రోజు అయిన శనివారం (ఆగస్టు 16) సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు మృతుల్లో 21 మృతదేహాలను గుర్తించారు. ఇద్దరు %జుూఖీ% సిబ్బంది మృతదేహాలున్నాయి. 300 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇంకా 73 మంది గల్లంతయిన వారి ఆచూకీ దొరకలేదని అధికారులు వెల్లడించారు.
ఈ ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఎల్జీ మనోజ్ సిన్హాలతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని కోరారు. మరోవైపు కిష్త్వార్ లో భారీ వరదలనుంచి బయటపడిన బాధితులు క్లౌడ్ బరస్ట్ బీభత్సాన్ని గుర్తు చేసుకున్నారు. ఆకస్మాత్తుగా బాంబు పేలినట్లుగా శబ్దం వచ్చింది. పరుగెత్తండి,పరుగెత్తండి అంటూ అరుపులు వినిపించాయి. ఇండ్లు పేకమేడల్లా కూలిపోయి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. నేను పరుగెత్తుతుండగా శిథిలాలు నాపై దూసుకురావడంతో చిక్కుకుపోయారు. విద్యుత్ స్తంభం నాపై పడింది. నా కూతురుకి ఫోన్ చేశారు. ఆమె నన్ను అక్కడినుంచి బయటికి లాగింది ప్రత్యక్ష సాక్షి, బాధితులు తెలిపింది.
"చాలా మంది చనిపోయారు ..చాలా మంది గాయపడ్డారు..నేనే నీటి ప్రవాహంలో ఇరుక్కుపోయాను.. ఒక పోలీసు నాకు సహాయం చేసి నన్ను ఆసుపత్రికి తీసుకువచ్చారు. నా సోదరి ప్రస్తుతం కనిపించడం లేదు అని మరో బాధితుడు కన్నీటి పర్యంతం అయ్యారు. కిష్త్వారాలో క్లౌడ్ బరస్ట్ సంభవించినప్పుడు అక్కడే ఉన్న బాధితుడు మాట్లాడుతూ.. "మేం ఎగిరిపోయి కారు కింద చిక్కుకున్నాను..నా తల్లి విద్యుత్ స్తంభం కింద పడింది. సైన్యం,%జుూఖీ% జవాన్లు ఘటనా స్థలానికి చేరుకుని మమ్మల్ని రక్షించారు అని అన్నారు.ఇక కిష్త్వార్ జిల్లా ఆసుపత్రి వైద్య సూపరింటెండెంట్ డాక్టర్ యుధ్వీర్ సింగ్ కొత్వాల్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 88 మంది క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నాం..36 మందిని జమ్మూలోని జీఎంసికి రిఫర్ చేశాం. ఆసుపత్రికి తీసుకువచ్చిన రెండు మృతదేహాల గుర్తించాల్సి ఉందని తెలిపారు.

# నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద.. 20గేట్లు ఓపెన్



హైదరాబాద్ పెన్ పవర్: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి. శనివారం (ఆగస్టు16) కృష్ణా నదికి భారీగా వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్టులోని 20 క్రస్ట్ గేట్లను అధికారులు ఎత్తివేశారు. ప్రాజెక్టుకు ప్రస్తుత ఇన్ ఫ్లో 1లక్షా 99వేల 544 క్యూసెక్కులు ఉండగా.. ఔట్ ఫ్లో 1లక్షాల 86వేల 860 క్యూసెక్కులుగా ఉంది. దీంతో డ్యామ్ నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని చూసేందుకు, డ్యాం పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 589.40 అడుగులుగా ఉంది. సాగర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు..ప్రస్తుతం 310.510 టీఎంసీలుగా ఉంది. జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. సాగర్ గేట్లు ఎత్తటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను జాగ్రత్తగా ఉండాలని అధికారులు అప్రమత్తం చేశారు. ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలోకి వెళ్లొద్దని హెచ్చరించారు.

# తెలంగాణలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అల్పపీడన ప్రభావంతో ఈ రోజు భూపాలపల్లి, సంగారెడ్డి, కామారెడ్డి, నిర్మల్, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, వికారాబాద్, మెదక్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

**ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వాన..**

ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని పలు మండలాల్లో ఈ రోజు తెల్లవారుజాము నుంచి భారీ వర్షం పడుతోంది. వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి, భైంసా గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 6,484 క్యూసెక్కులు కాగా అధికారులు రెండు గేట్లు ఎత్తి 4,571 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# 16 ఏళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన ..మాదాపూర్ లో హాస్టల్ యజమానిని చితకబాదిన అమ్మాయిలు






హైదరాబాద్ పెన్ పవర్:తమ పట్ల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని మాదాపూర్ లో ఓ హాస్టల్ యజమానిని చితకబాదారు అమ్మాయిలు. నెల రోజుల పాటు మైనర్ బాలికను వేధిస్తున్నారనే ఆరోపణలతో హాస్టల్ లోని ఫర్నీచర్ ను ధ్వంసం చేశారు కుటుంబ సభ్యులు. హాస్టల్ నిర్వాహకుడిపై దాడి చేశారు. మదాపూర్ లో ఇమేజ్ గార్డెన్ రోడ్డులోని అర్వవ్ ప్లాజాలో ఎన్ పీపీ ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లో ఓ మైనర్ బాలిక ఉంటుంది. బోరబండకు చెందిన 16 ఏళ్ల అమ్మాయి హాస్టల్ లో ఉంటూ నీట్ ట్రెనింగ్ తీసుకుంటోంది. నెల రోజుల పాటు మైనర్ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని అమ్మాయిలు ఆరోపిస్తున్నారు. హాస్టల్ కు వచ్చిన తల్లిదండ్రులు , అమ్మాయిలు కలిసి యజమాని సత్యప్రకాశ్ ను చితకబాదారు. హాస్టల్ అద్దాలు, ఫర్నీచర్, చెట్ల కుండీలు ధ్వంసం చేశారు.

మైనర్ పై లైంగిక దాడి చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా.. అత్యాచారం జరగలేదని, అదంతా అబద్ధమని చెబుతున్నారు హాస్టల్ నిర్వాహకులు. బిల్డింగ్ విషయంలో జరుగుతున్న గొడవలో భాగంగా తనపై దాడి చేశారని చెబుతున్నాడు హాస్టల్ యజమాని . కావాలనే సన్ సిటీ నుంచి గ్యాంగ్ ను తీసుకొచ్చి గొడవ చేస్తున్నారని ఆరోపిస్తున్నాడు. గత మూడు నెలల్లో రెండోసారి తనపై దాడి చేశారని చెబుతున్నాడు యజమాని సత్యప్రకాశ్.

స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు పోలీసులు. హాస్టల్ నిర్వాహకుడు సత్యప్రకాశ్ ను పీఎస్ కు తీసుకెళ్లారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లైంగిక దాడి జరిగిందా? లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# చందానగర్ ఖజానా దొంగలు దొరికారు.. 20 రోజులు రెక్కీ చేసి దోపిడికి ప్లాన్







హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ లో ఆగస్టు 12న చందానగర్ లోని ఖజానా జ్యువెలరీ షోరూంలో దోపిడి చేసి కాల్పుల జరిపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఏడుగురి నిందితులను గుర్తించిన పోలీసులు ఆశిష్ , దీపక్ కుమార్ అనే ఇద్దరిని అరెస్ట్ అరెస్ట్ చేశారు. దోపిడి దొంగలు బీహార్ కి చెందిన వారిగా గుర్తించారు పోలీసులు. నిందితులపై బీహార్ లో కూడా దోపిడి కేసులు ఉన్నట్లు చెప్పారు మాదాపూర్ పోలీసులు.

ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించిన మాదాపూర్ డీసీపీ వినీత్ .. ఖజానా జ్యువెలరీ దగ్గర దొంగలు 20 రోజులు రెక్కీ నిర్వహించారని చెప్పారు. నిందితులు ఇద్దరిని పూణెలో అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి 900 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నామన్నారు. వెస్ట్ బెంగాల్ , కోల్ కత్తాలో జ్యువెలర్స్ షాప్ లలో దోపిడీలు జరిగాయిన్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిపై 10 కేసులు ఉన్నట్లు చెప్పారు. ఈ కేసులో 10 కేజీల సిల్వర్ దోపిడీ చేశారని.. 900 గ్రాముల సిల్వర్ రికవరీ చేశామన్నారు. నిందితులు జగద్గిరిగుట్టలో ఉంటూ దోపిడికి ప్లాన్ చేశారని చెప్పారు. జగద్గిరిగుట్టలో అద్దెకు బైక్స్ తీసుకొని వచ్చి దోపిడీ చేశారని తెలిపారు. అదే బైక్స్ పై సిటీ దాటి వెళ్లిపోయారని తెలిపారు. మిగతా నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

పరారీలో ఉన్న సివాన్ గ్యాంగ్ కోసం గాలిస్తున్నామని తెలిపారు డీసీపీ వినీత్. సివాన్ గ్యాంగ్ మొదటి సారి హైదరాబాద్ లో దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. ఒక్కసారి దోపిడీ చేసిన తరువాత మరోసారి ఆ ప్రాంతంలో సివాని గ్యాంగ్ దోపిడీ చేయబోదన్నారు. దొరికినంత దోచుకోవడమే సివాన్ గ్యాంగ్ లక్ష్యమని చెప్పారు.

# ట్రంప్ తారిఫ్‌తో తమిళనాడుకు తీవ్రనష్టం.. ఆదుకోండి: ప్రధాని మోదీకి సీఎం స్టాలిన్ లెటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వస్తువులపై అమెరికా సుంకాలు పెంచిన క్రమంలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ట్రంప్ సుంకాల ప్రభావం తమిళనాడు ఎగుమతిదారులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఎత్తిచూపింది. తక్షణ ఉపశమన చర్యలు తీసుకోవాలని స్టాలిన్ లేఖలో డిమాండ్ చేశారు.

**ఇతర రాష్ట్రాల కంటే తమిళనాడుకే తీవ్రదెబ్బ**

ప్రస్తుత 25శాతం సుంకం 50శాతానికి పెరిగితే తమిళనాడు తీవ్ర ప్రభావాలను ఎదుర్కొంటుందని సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి రాసిన లేఖను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తం ఎగుమతుల్లో తమిళనాడునుంచే అధికం అన్నారు. దాదాపు 52.1 బిలియన్ డాలర్ల ఎగుమతులు అంటే 31 శాతం తమిళనాడు నుంచి అమెరికాకు వెళ్లిందని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడు చాలా తారిఫ ప్రభావంతో తమిళనాడు ఎగుమతి దారులకు తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు.

**ప్రమాదంలో కార్మిక-, శ్రామిక రంగాలు**



వస్త్రాలు, దుస్తులు, యంత్రాలు, ఆటో భాగాలు, రత్నాలు ,ఆభరణాలు, తోలు, పాదరక్షలు, సముద్ర ఉత్పత్తులు ,రసాయనాలు ఎక్కువగా రంగాలు అధిక శ్రమతో కూడుకున్నవి. ట్రంప్ తారిఫ్ తో ఎగుమతుల్లో మందగమనం ఈ రంగాల్లో భారీ తొలగింపులకు దారితీస్తుందని స్టాలిన్ హెచ్చరించారు. 2024-25లో భారతదేశ వస్త్ర ఎగుమతుల్లో తమిళనాడు 28శాతం వాటా ఉంది. ఇది అన్ని రాష్ట్రాల కంటే అత్యధికం. వస్త్ర రంగంలోనే దాదాపు 75 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు.సుంకాలు 25శాతం నుంచి 50శాతం వరకు పెరగడంతో 30 లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయని అంచనా వేశారు.

**ఉపశమనం కోసం కీలక డిమాండ్లు**

పరిశ్రమ సంఘాలతో సంప్రదింపుల అనంతరం GST విలోమ సుంకం నిర్మాణాన్ని సరిదిద్దాలని, ఈ పరిశ్రమపై జీఎస్టీ 5శాతం స్లాబ్ కిందకు తీసుకురావాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. అన్ని రకాల పత్తిపై దిగుమతి సుంకాన్ని మినహాయించాలని కోరారు.

అత్యవసర క్రెడిట్ లైన్ గ్యారెంటీ పథకం (ECLGS) కింద 30శాతం వరకు పూచీకత్తు లేని రుణాలను 5శాతం వడ్డీ రాయితీ ,ప్రధాన చెల్లింపుపై రెండేళ్ల మారటోరియంతో అందించాలని స్టాలిన్ కోరారు. ఎగుమతి చేసిన ఉత్పత్తులపై సుంకాలు, పన్నుల మినహాయింపు (RoDTEP) ప్రయోజనాలను 5శాతానికి పెంచడం,నూలుతో సహా అన్ని వస్త్ర ఎగుమతులకు ప్రీ- ,పోస్ట్-షిప్‌మెంట్ క్రెడిట్‌ను విస్తరించాలని కూడా సూచించారు.

**ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కావాలి..**

క్విడిటీ ,ఖర్చు భారాలను తగ్గించడానికి టారిఫ్ తో దెబ్బతిన్న ఎగుమతిదారులందరికీ ప్రత్యేక వడ్డీ రాయితీ పథకాన్ని స్టాలిన్ డిమాండ్ చేశారు. టారిఫ్ నష్టాలను భర్తీ చేయడానికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

COVID-19 కాలంలో అమలు చేసిన చర్యల మాదిరిగానే ప్రధాన చెల్లింపులపై తాత్కాలిక నిషేధంతో సహా ప్రత్యేక ఆర్థిక ఉపశమన ప్యాకేజీని ప్రకటించాలని కోరారు. బ్రెజిల్ పన్ను వాయిదా ,ఎగుమతిదారులకు క్రెడిట్లను అందించినట్లుగానే తమిళనాడుకు అందించాలని డిమాండ్ చేశారు.

# హై అలర్ట్.. వంట మనిషి వేషంలో ఉగ్రవాది? ఎలా గుర్తించారంటే..

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీలో ఉగ్రవాదుల కదలికలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. కౌంటర్ ఇంటెలిజెన్స్, ఎన్ఐఏ పోలీసుల అప్రమత్తత వల్ల ఉగ్రవాదుల జాడ ముందే గుర్తించడం పెను ముప్పు తప్పినట్లు చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం మే నెలలో విజయనగరం పట్టణానికి చెందిన ఓ యువకుడికి ఉగ్ర లింకులు ఉన్నట్లు బయటపెట్టిన పోలీసులు.. తాజాగా సత్యసాయి జిల్లా ధర్మవరంలో మరో యువకుడికి ఉగ్ర లింకులు ఉన్నట్లు గుర్తించారు. ధర్మవరం పట్టణంలో ఓ చిన్న హోటల్ లో వంటమనిషిగా పనిచేస్తున్న యువకుడు కదలికలు గత కొన్ని నెలలుగా అనుమానాస్పదంగా ఉండటం, సోషల్ మీడియా ద్వారా ఉగ్ర లింకులు ఏర్పరచుకున్నట్లు నిర్ధారణ కావడంతో ఆకస్మికంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనతో గతంలో హైదరాబాదులో తలదాచుకున్న ఉగ్రవాదులు ఇప్పుడు తమ మకాం రాయలసీమకు మార్చారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాయలసీమలోని సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కోట కాలనీలో నివాసం ఉంటున్న నూర్ అనే వ్యక్తిని ఎన్ఐఏ పోలీసులు రెండురోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారని ఆలస్యంగా తెలిసింది. స్థానికంగా ఓ హోటల్లో వంట మనిషిగా పనిచేస్తున్న నూర్ కదలికలపై కొన్ని రోజులుగా ఎన్ఐఏ పోలీసులు నిఘా వేసినట్లు చెబుతున్నారు. అతడి అనుమానాస్పద తీరుతో సోషల్ మీడియా ఖాతాలపై నిఘా వేసినట్లు సమాచారం. ఎన్ఐఏ అధికారుల పరిశీలనలో అతడు దేశం అవతల శక్తులతో సంభాషిస్తున్నట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. దీంతో రెండు రోజుల క్రితం ఆకస్మికంగా నూర్ ఇంటిపై దాడి చేయగా, అతడి ఇంట్లో ఏకంగా 16 సిమ్ కార్డులు బయటపడ్డాయని అంటున్నారు. సామాన్య వంట మనిషికి 16 సిమ్ కార్డులు ఉండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘ వ్యతిరేక కార్యకలాపాల వల్లే అతడు అన్ని సిమ్ కార్డులు ఉంచుకున్నాడా? అనే




దిశగా ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోందని చెబుతున్నారు.

ఈ ఘటనతో ధర్మవరంతోపాటు రాయలసీమ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్రాన్ని ఉగ్రవాదులు షెల్టర్ జోన్ గా మార్చుకుంటున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత నాలుగు నెలల్లో ఇది మూడో అరెస్టు కావడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల అప్రమత్తత వల్ల ఉగ్రవాదుల ముప్పు తప్పినా, ప్రజల మధ్యే రకరకాల వేషాల్లో ఉగ్రవాదులు తిరుగుతుండటమే భయాందోళనకు కారణమవుతోందని అంటున్నారు. రాష్ట్రంలో తొలుత మే 17న విజయనగరం పట్టణానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాద భావజాలం ఉన్న సిరాజ్ హైదరాబాద్ కు చెందిన సమీర్ సయ్యర్ తో కలిసి రాష్ట్రంలో బాంబు పేలుళ్లకు ప్రయత్నించినట్లు పోలీసులు చెప్పారు. సోషల్ మీడియా ద్వారా విదేశాల్లో ఉన్న ఉగ్రవాదులతో సిరాజ్, సమీర్ సంభాషించడాన్ని గుర్తించిన తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు పక్కా వ్యూహంతో ఆ ఇద్దరిని అరెస్టు చేశారు. అప్పటికే బాంబు పేలుళ్లపై ఆ ఇద్దరు కొన్ని ట్రయల్స్ నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. కొద్ది రోజుల్లో తమ ప్లాన్ అమలు చేయాలని ఆ ఇద్దరు ప్రయత్నిస్తున్న దశలో పోలీసులు కుట్రను ఛేదించారు. దీంతో హమ్మయ్య అని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇక అక్కడికి నెల రోజుల వ్యవధిలోనే రాయలసీమలోని అన్నమయ్య జిల్లాలో మరో ఉగ్ర లింకు బయటపడింది. ఈ సారి దేశంలో పలు నగరాల్లో బాంబు పేలుళ్లకు కారణమైన ఇద్దరు ఉగ్రవాదులు చాలా కాలం నుంచి మారు వేషంలో రాయచోటిలో తలదాచుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

తమిళనాడులో నిషేధించబడిన "అల్ ఉమ్మా" అనే ఉగ్రవాద సంస్థకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు దాదాపు 20 ఏళ్లుగా రాయచోటిలో మారు వేషంలో ఉంటున్నారని గత నెలలో పోలీసులు గుర్తించారు. పక్కా ప్లానింగుతో ఆ ఇద్దరిని పట్టుకున్నారు. దర్యాప్తులో వారిద్దరూ నిషేధిత సంస్థకు చెందిన ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహమ్మద్ అలీగా తేలింది. వారి నివాసాల నుంచి పోలీసులు సూట్‌కేస్ బాంబులు, బకెట్ బాంబులతో పాటు పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, వాకీటాకీలు వంటివి స్వాధీనం చేసుకున్నారు. వీటిని అక్టోపస్ బృందం రాయచోటి డీఎస్పీ కార్యాలయం సమీపంలో నిర్వీర్యం చేసింది. చీరల వ్యాపారం పేరుతో రాయచోటి చుట్టు పక్కల ప్రాంతాల్లో తిరిగే ఈ ఇద్దరు భారీ పేలుళ్లకు ప్లాన్ చేయడంతో ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా 1995-2013 మధ్య కాలంలో తమిళనాడు, కేరళ, కోయంబత్తూరు, తిరుచ్చి, చెన్నైతో సహా పలు ప్రాంతాల్లో జరిగిన బాంబు పేలుళ్లు, రాజకీయ హత్యలు, కుట్రలకు వీరికి సంబంధం ఉందనే అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 1999లో నాగూర్ పార్శిల్ బాంబు పేలుడులో, 2011లో మధురైలో ఎల్.కె.అద్వానీ రథయాత్ర సమయంలో పైప్ బాంబు కుట్ర, 2013లో బెంగళూరులో జరిగిన బాంబు పేలుళ్లకు వీరికి సంబంధం ఉందని పోలీసులు చెబుతున్నారు. స్థానిక మహిళలను వివాహం చేసుకుని, తమ ఉగ్ర కార్యకలాపాలను ఎవరికీ అనుమానం కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో ధర్మవరంలో మరో ఉగ్ర లింకు బయటపడటం ఆందోళన రేకెత్తిస్తోంది. వరుసగా బయటపడుతున్న లింకులతో రాష్ట్రానికి చెందిన యువత బయట శక్తుల పట్ల ఎందుకు ఆకర్షణకు గురవతోందనే చర్చ జరుగుతోంది.

## భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటి ఉద్ధృతి.. సాయంత్రానికి 29.6 అడుగులకు చేరిన నీటిమట్టం

రెండు రోజుల క్రితం 16 అడుగుల వద్ద నీటిమట్టం

సాయంత్రానికి 29 అడుగులకు చేరిన నీటిమట్టం

స్నానమాచరించే భక్తులు లోపలకు వెళ్లవద్దని హెచ్చరిక




**హైదరాబాద్ పెన్ పవర్:**భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వల్ల భద్రాచలం వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం సాయంత్రానికి గోదావరి నీటి మట్టం 29.6 అడుగులు దాటి ప్రవహిస్తోంది. రెండు రోజుల క్రితం 16 అడుగుల మేర ఉన్న గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతూ 29 అడుగులు దాటింది.ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వల్ల భద్రాచలం వద్ద ఇంకా నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భద్రాచలం వద్ద నదిలో స్నానమాచరించే భక్తులు నది లోపలకి వెళ్లకుండా ఒడ్డునే ఉండి స్నానమాచరించాలని ఆదేశాలు జారీ చేశారు. నది వద్ద లాంచీలు, పడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

## రజినీ 50 ఏళ్ల ప్రస్థానం.. స్పెషల్ విషెస్ చెప్పిన ప్రధాని మోదీ



**హైదరాబాద్ పెన్ పవర్:** బస్ కండక్టర్ గా జీవితం ప్రారంభించిన సూపర్ స్టార్ గా ఎదిగారాయన. భారతీయ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసుకున్నారు. తన నటనా కౌశలంతో మాస్, క్లాస్ అభిమానులను కట్టి పడేసిన లెజెండ్ రజినీ కాంత్. ఒకవైపు యాక్షన్ హీరోగా, మరోవైపు హాస్యంతో, సీరియస్ పాత్రలతో ప్రేక్షకులను అలరించిన ఆయనకు సరిహద్దులు లేవు. తెలుగు, తమిళం మాత్రమే కాకుండా హిందీ, కన్నడ, మలయాళం సినిమాల్లోనూ తన ప్రత్యే కతను చాటుకున్నాడు. ఆయన సినీ ప్రస్థానంలో 50 ఏళ్లుపూర్తి చేసుకున్నారు. నటనలోని వైవిధ్యం, కష్టపడి సాధించిన స్థానమే ఆయనను లెజెండ్ గా నిలిపాయి. ఇక ఈ అరుదైన విజయోత్సవ సందర్భంలో రజనీకాంత్ కు సెలబ్రెటీలు, రాజకీయ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ సూపర్ స్టార్ రజినీకాంత్ కు ఎక్స్ ద్వారా శుభకాక్షలు తెలిపారు... “సూపర్ స్టార్ తలైవా రజనీకాంత్ గారికి సినీ పరిశ్రమలో 50 ఏళ్ల విజయోత్సవం సందర్భంగా హృదయపూర్వక అభినందనలు. మీ అభినయం, స్టైల్, విభిన్న పాత్రలతో తరతరాల ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసిన సినీ ప్రయాణం నిజంగా ప్రేరణాత్మకం. ఇకపై కూడా ఆరోగ్యం, ఆనందం కలిగి దీర్ఘాయుష్షుతో మరెన్నో విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం’ అని రాసుకొచ్చారు ప్రధాని,

# మార్వాడీ గోబ్యాక్ అంటూ.. ఆగస్టు 18న అమనగల్లు బంద్ కు పిలుపు



**హైదరాబాద్ పెన్ పవర్:** మార్వాడీ గోబ్యాక్ ఉద్యమం. .హైదరాబాద్ నగరంనుంచి తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తోంది. రాష్ట్రంలోని వివిధ గ్రామాల్లో మార్వాడీ గోబ్యాక్ అంటూ నినదిస్తున్నారు. నల్లగొండ జిల్లా ఆమనగల్లులో వ్యాపారులు మార్వాడీ గోబ్యాక్ అంటూ నినదించారు. ఆగస్టు 18న మార్వాడీ గోబ్యాక్ అంటూ స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి ఆమనగల్లుకు చెందిన కిరాణ ,వస్త్ర ,వర్తక సంఘం,- స్వర్ణకార సంఘం బంద్ కు పిలుపునిచ్చింది. తెలంగాణలో అన్ని ప్రాంతాల్లో మార్వాడీలు విస్తరిస్తూ అన్ని రకాల వ్యాపారాలను కబ్జా చేస్తున్నారని నాణ్యతలేని, నాసిరకం వస్తువులను అమ్ముతూ ఈ ప్రాంత వ్యాపారస్తులను పరోక్షం దెబ్బతీస్తున్నారని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. మార్వాడీల విస్తరణతో స్థానిక యువత ఉపాధి కోల్పోతున్నారని ఆరోపించారు.మార్వాడీ షాపుల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించకుండా వారి ప్రాంతాలనుంచి తీసుకొచ్చిన మనుషులను లేబర్ గా పెట్టుకుంటున్నారని అన్నారు. ఇదే ఇలాగే కొనసాగితే తెలంగాణ ప్రజల మనుగడకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ బంద్ కు పిలుపినిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు తెలంగాణలో ఇటీవల గో బ్యాక్ మార్వాడీ అనే నినాదంతో సోషల్ మీడియాలో ఓ ఉద్యమం మొదలయ్యింది ఈ వివాదం సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్‌లో జరిగిన ఓ ఘటనతో ప్రారంభమైంది. పార్కింగ్ విషయంలో ఓ దళితుడిపై మార్వాడీ వ్యాపారులు దాడి చేశారని అట్రాసిటీ కేసు నమోదు అయింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన గాయకుడు, రచయిత గోరేటి రమేష్ మార్వాడీల దోపిడీని వివరిస్తూ ఒక పాట రాసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ పాట పెద్ద ఎత్తున వైరల్ కావడంతో మార్వాడీలకు వ్యతిరేకంగా గో బ్యాక్ మార్వాడీ అనే నినాదం మొదలైంది.

గోరేటి రమేష్ రాసిన పాటతో స్ఫూర్తి పొందిన స్థానిక గ్రూపులు, ప్రజలు సోషల్ మీడియాలో మార్వాడీ గోబ్యాక్ ఉద్యమం ఉధృతం అయింది. మార్వాడీల దుకాణాలను, స్వీట్ హౌస్‌లను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. వారి దగ్గర వస్తువులు కొనవద్దని, ఆహార పదార్థాలు తీసుకోవద్దని ప్రచారం చేస్తున్నారు.

ఈ వివాదంపై బీజేపీ నాయకులు బండి సంజయ్ కుమార్ ,రాజా సింగ్ స్పందించి మార్వాడీలకు మద్దతుగా మాట్లాడారు. మార్వాడీ గో బ్యాక్ ఉద్యమం హిందూ సమాజాన్ని చీల్చడానికి కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్ర అని వారు ఆరోపించారు.తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో మార్వాడీల ఉనికి వందల సంవత్సరాలుగా ఉంది. నిజాం పాలన కాలంలోనే చాలా మంది మార్వాడీలు రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. వారు వ్యాపారం, వాణిజ్యం, అప్పులు ఇవ్వడం వంటి ఆర్థిక కార్యకలాపాలలో కీలకంగా ఉన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మార్వాడీలు ముఖ్యమైన ఆధారం అని వారి పూర్వీకులు ఈ ప్రాంతంలోనే పుట్టి, ఈ అభివృద్ధికి తోడ్పడ్డారని కొందరు చెబుతున్నారు.

అయితే మార్వాడీలు ఆర్థికంగా దోపిడీకి పాల్పడుతున్నారని స్థానిక వ్యాపారులు ,ప్రజలు ఆరోపిస్తున్నారు.ఈ వివాదం సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల మధ్య తీవ్రమైన చర్చలకు దారి తీస్తోంది.

# రూ.5వేల పెట్టుబడితో స్టార్ట్ చేసి 40వేల కోట్లు సంపాదించిన రాకేష్ జున్‌జున్‌వాలా.. ఇది సక్సెస్ స్టోరీ..!




**హైదరాబాద్ పెన్ పవర్:**రాకేష్ జున్‌జున్‌వాలా స్టాక్ మార్కెట్ ప్రపంచంలో ఈ పేరు వినని వ్యక్తులు ఉండరు. దివంగతులపై ఈ వెటరన్ ఇన్వెస్టర్ ను గతంలో బిగ్ బుల్ అని కూడా పిలిచేవారు. 37 ఏళ్ల సుదీర్ఘ ఇన్వెస్ట్మెంట్ ప్రయాణంలో రాకేష్ దలాల్ స్ట్రీట్ లో మోస్ట్ ఫేమస్. ఆయన ఏ స్టాక్స్ కొన్నారు.. ఏం మాట్లాడుతున్నారు.. ఏం చేస్తున్నారు వంటి విషయాలను చాలా మంది ఇన్వెస్టర్లు పరిశీలిస్తూనే ఉండేవారు. ప్రస్తుతం ఆయన కుటుంబం రాకేష్ లెగసీని కొనసాగిస్తోంది. వృత్తి రీత్యా ఇన్వస్టర్ అయిన రాకేష్ ఒక చార్టెడ్ అకౌంటెంట్. ముంబైలో స్థిరపడిన ఈ మార్వాడీ మధ్యతరగతి కుర్రోడు హైదరాబాదులో చదువుకున్నాడు. ఆయన తండ్రి ఆదాయపు పన్ను శాఖలో పనిచేస్తున్న సమయంలో వారు హైదరాబాద్ ప్రాంతంలో కూడా నివసించారు. 1960 జూలై 5 పుట్టిన రాకేష్ తన ఇన్వెస్ట్మెంట్ ప్రయాణాన్ని కేవలం రూ.5వేలతో స్టార్ట్ చేసారు. కానీ ప్రస్తుతం ఆయన సంపద విలువ దాదాపు రూ.40వేల కోట్లుగా అంచనా వేయబడింది. తండ్రి వార్తాపత్రికలు చదవమని అలవాటు చేయటంతో ఆయనకు ప్రపంచ వాణిజ్యం, వ్యాపారాల పనితీరు వంటి అంశాలపై పట్టు వచ్చింది.


తొలిసారి పెట్టుబడికోసం తన సోదరుడి నుంచి రూ.5వేలు అప్పుగా తీసుకున్న రాకేష్ ఆ తర్వాత వెనక్కి తిరిగి చూడలేదు. అప్పట్లో ఆ డబ్బుతో టాటా టీ షేర్లను ఒక్కోటి రూ.43 రేటుకు కొనుగోలు చేయగా.. వాటి విలువ 3 నెలల్లోనే రూ.143కి చేరుకోవటంతో లక్షల్లో లాభం వచ్చింది. ఆ తర్వాత ఆయన టాటా పవర్, సెసాగోవా ఫర్నిచర్ వంటి పెట్టుబడులతో మంచి లాభం చూశారు. ఇక టాటాలకు చెందిన టైటాన్ స్టాక్ రాకేష్ ఫేవరెట్ అని అందరికీ తెలిసిందే. లాభాలు తగ్గుతున్నప్పటికీ తనిష్క్ వ్యాపారంపై నమ్మకంతో రాకేష్ పెట్టుబడిని కొనసాగించారు. అప్పట్లో షేరును రూ.30-40 మధ్య రేటుకు కొనగా 2025 మార్కెట్ లెక్కల ప్రకారం ఆ స్టాక్ విలువ రూ.15వేల కోట్లకు చేరింది.

రాకేష్ ఎప్పుడూ చెబుతుండే మాట మార్కెట్లలో అందరూ అమ్ముతున్నప్పుడు కొనటం స్టార్ట్ చేయాలని. ఎందుకంటే క్వాలిటీ స్టాక్స్ తక్కువ రేటుకు పొందొచ్చని రాకేష్ భావించేవారు. ఆ తర్వాత ఆయన స్థాపించిన రేర్ ఎంటర్ ప్రైజెస్ రాకేష్ కుటుంబానికి సంబంధించిన పెట్టుబడులను చూసుకునేది. మరణానికి కొన్ని నెలల ముందు రాకేష్ ఆకాశ విమానయాన సంస్థను స్టార్ట్ చేశారు. 2021లో స్టార్ట్ అయిన కంపెనీలో ఆయన సహవ్యవస్థాపకులు.

2022 ఆగస్టులో రాకేష్ గుండెపోటు కారణంగా మరణించారు. ప్రస్తుతం ఆయన పెట్టుబడులకు సంబంధించిన పూర్తి వ్యవహారాలను రాకేష్ భార్య రేఖా జున్‌జున్‌వాలా చూసుకుంటున్నారు. 2024లో ఈ పెట్టుబడుల విలువ రూ.60వేల కోట్లకు పైగా ఉన్నట్లు వెల్లడైంది. 2023లో పద్మశ్రీతో సత్కరించబడిన రాకేష్ జున్‌జున్‌వాలా తన సంపదలో 25 శాతాన్ని ఛారిటీ కోసం వెచ్చించాలని నిర్ణయించారు. దీంతో ఆ మొత్తాన్ని విద్య, వైద్య సేవలకు కేటాయిస్తున్నారు.

# హైదరాబాద్ ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త

- టీఏవైఎల్ టిక్కెట్‌పై రూ. 10 నుంచి రూ. 20 వరకు తగ్గింపు
- ఈ నెల 15 నుంచి 31 వరకు అందుబాటులో తగ్గింపు ధరలు
- మెట్రో డీలక్స్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్?ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు అందుబాటులో టిక్కెట్లు




**హైదరాబాద్ పెన్ పవర్:**భాగ్యనగర ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్తను అందించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఫ్రీడమ్ ఆఫర్' కింద ట్రావెల్ యాజ్ యు లైక్ (టీఏవైఎల్) టిక్కెట్ ధరను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. పరిమిత కాలం వరకు మాత్రమే ఈ తగ్గింపు ధర అందుబాటులో ఉంటుంది. ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు తగ్గింపు ధరలు అందుబాటులో ఉంటాయని సంబంధిత అధికారులు తెలిపారు.మెట్రో డీలక్స్ బస్సులతో పాటు సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు ఈ టిక్కెట్లను కొనుగోలు చేసే సౌకర్యం కల్పించారు. పెద్దలకు ఇంతకుముందు టిక్కెట్ ధర రూ. 150 కాగా, ఆఫర్ కింద రూ. 130కి తగ్గించారు. మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు ఇంతకు ముందు రూ. 120గా ఉన్న టిక్కెట్ ధరను రూ. 110కి తగ్గించారు. పిల్లలకు రూ. 100 ఉండగా, దీనిని రూ. 90కి సవరించారు.

# 16 ఏళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన ..మాదాపూర్ లో హాస్టల్ యజమానిని చితకబాదిన అమ్మాయిలు

**హైదరాబాద్ పెన్ పవర్:**తమ పట్ల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని మాదాపూర్ లో ఓ హాస్టల్ యజమానిని చితకబాదారు అమ్మాయిలు. నెల రోజుల పాటు మైనర్ బాలికను వేధిస్తున్నారనే ఆరోపణలతో హాస్టల్ లోని ఫర్నీచర్ ను ధ్వంసం చేశారు కుటుంబ సభ్యులు. హాస్టల్ నిర్వాహకుడిపై దాడి చేశారు. మదాపూర్ లో ఇమేజ్ గార్డెన్ రోడ్డులోని అర్ణవ్ ప్లాజాలో ఎన్ పీపీ ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లో ఓ మైనర్ బాలిక ఉంటుంది. బోరబండకు చెందిన 16 ఏళ్ల అమ్మాయి హాస్టల్ లో ఉంటూ నీట్ ట్రైనింగ్ తీసుకుంటోంది. నెల రోజుల పాటు మైనర్ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని అమ్మాయిలు ఆరోపిస్తున్నారు. హాస్టల్ కు వచ్చిన తల్లిదండ్రులు , అమ్మాయిలు కలిసి యజమాని సత్యప్రకాశ్ ను చితకబాదారు. హాస్టల్ అద్దాలు, ఫర్నీచర్, చెట్ల కుండీలు ధ్వంసం చేశారు. మైనర్ పై లైంగిక దాడి చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా.. అత్యాచారం జరగలేదని, అదంతా అబద్ధమని చెబుతున్నారు హాస్టల్ నిర్వాహకులు. బిల్డింగ్ విషయంలో జరుగుతున్న గొడవలో భాగంగా తనపై దాడి చేశారని చెబుతున్నాడు హాస్టల్ యజమాని . కావాలనే సన్ సిటీ నుంచి గ్యాంగ్ ను తీసుకొచ్చి గొడవ చేస్తున్నారని ఆరోపిస్తున్నాడు. గత మూడు నెలల్లో రెండోసారి తనపై దాడి చేశారని చెబుతున్నాడు యజమాని సత్యప్రకాశ్. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు పోలీసులు. హాస్టల్ నిర్వాహకుడు సత్యప్రకాశ్ ను పీఎస్ కు తీసుకెళ్లారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లైంగిక దాడి జరిగిందా? లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# : జిమ్‌లో అసదుద్దీన్ కసరత్తులు.. అవలీలగా 20 కిలోల బరువు ఎత్తిన ఎంపీ

- హైదరాబాద్‌లో కొత్త ఫిట్‌నెస్ స్టూడియో ప్రారంభించిన ఎంపీ ఒవైసీ
- ఈ సందర్భంగా జిమ్‌లో కసరత్తులు చేసిన అసదుద్దీన్
- 20 కిలోల బరువులు, డంబెల్స్‌ను అవలీలగా ఎత్తిన వైనం
- ఆయన ఫిట్‌నెస్ చూసి ఆశ్చర్యపోయిన స్థానికులు
- శారీరక దృఢత్వంపై దృష్టి పెట్టాలంటూ యువతకు పిలుపు
- ఫిట్‌నెస్ ప్రాముఖ్యతను వివరిస్తూ కీలక సూచనలు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఎల్లప్పుడూ రాజకీయ ప్రసంగాలతో, వాడివేడి వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీలో ఒక కొత్త కోణం ఆవిష్కృతమైంది. రాజకీయ వేదికలపై కాకుండా ఈసారి ఆయన వ్యాయామశాలలో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యపరిచారు. తన ఫిట్‌నెస్‌ను ప్రదర్శిస్తూ యువతకు శారీరక దృఢత్వంపై కీలక సందేశాన్నిచ్చారు. హైదరాబాద్‌లోని బహదూర్‌పురాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఒక ఫిట్‌నెస్ స్టూడియో ప్రారంభోత్సవ కార్యక్రమానికి అసదుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిబ్బన్ కత్తిరించి లాంఛనంగా ప్రారంభించడమే కాకుండా, ఆయన స్వయంగా వ్యాయామశాలలో కసరత్తులు చేశారు. అక్కడ ఉన్న 20 కిలోల బరువుల ప్లేట్లను, డంబెల్స్‌ను పైకి ఎత్తారు. దీంతో అక్కడున్న వారు ఆయన ఫిట్‌నెస్‌ను చూసి ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ, యువత చదువుతో పాటు శారీరక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతిరోజు కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండవచ్చని తెలిపారు. ఫిట్‌నెస్‌ను ఒక జీవనశైలిగా మార్చుకోవాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# వామ్మో.. పెన్ గంగ బ్రిడ్జిపై నుంచి దూకుతోంది.. నదులు రోడ్లపైకి వచ్చినయ్.. వానలకు ఆదిలాబాద్ జిల్లా అల్లకల్లోలం !




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదిలాబాద్ జిల్లా అల్లకల్లోలం అవుతోంది. జిల్లాలో క్లౌడ్ బరస్ట్ అవ్వడంతో ఎటు చూసినా వరదలు ముంచెత్తున్నాయి. అక్కడ కురుస్తున్న వానలను అతి భారీ వర్షాలు అనటం కూడా తక్కువేమో.. అంత తీవ్రంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆకాశం నుంచి కుండలతో నీళ్లు కుమ్మరిస్తున్నట్లుగా వస్తున్న వానలకు జిల్లా మొత్తం జలదగ్బంధం అయ్యింది. భారీ వర్షాలకు కుంటాల జలపాతం మునుపెన్నడూ లేనంతగా ఉధృతంగా పరవళ్లు తొక్కుతోంది. ఉప్పెన వచ్చిందా అన్నట్లు ప్రవహిస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవు తున్నారు. పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా మారటంతో అటవీ శాఖ అధికారులు పర్యాటకులను అనుమతించడం లేదు. ఇక పెన్ గంగా నది ఉగ్రరూపం దాల్చి భయంకరంగా ప్రవహిస్తోంది. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం ఆనందపూర్ లో బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలు బందయ్యాయి. బ్రిడ్జిపై నుంచి ప్రవహించేంత వరద వస్తుండటంతో సునామీ వచ్చిందా అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. పోలీసులు ఇరువైపు రాకపోకలు నిషేధించారు.

నదులు, చెరువులైన రోడ్లు, కాలనీలు: భారీ వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాలనిలు నీట మునిగాయి. పంజాబ్ చౌరస్తా చెరువును తలపిస్తోంది. రోడ్లపైన వరద నీరు గేట్లు ఎత్తిన నదిలా ప్రవహిస్తూ భయాందోళనకు గురి చేస్తోంది. రోడ్లన్నీ నదుల్లా కనిపిస్తుండటంతో వాహనదారులు రోడ్లెక్కడం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందలకు గురవుతున్నారు. థియేటర్ లోకి భారీగా నడుము లోతు వరద నీరు చేరుకుంది. దీంతో ఏసియన్ కాంప్లెక్స్ ను సినిమాల ప్రదర్శన నిలిపేశారు.

**గడ్డెన్న వాగు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల:**

నిర్మల్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని భైంసా గడ్డెన్న వాగు ప్రాజెక్టు లోకి వరద నీరు భారీగా పెరుగిపోతోంది. దీంతో ఐదు గేట్లు ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు అధికారులు. గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 358.70%వీ% కాగా.. ప్రస్తుత నీటిమట్టం 358.40%వీ% కు చేరుకుంది. ప్రాజెక్టులోకి 10 వేల500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

# ఖజానా జ్యుయలరీస్ లో రెక్కీ చేసి మరీ...?

**హైదరాబాద్ పెన్ పవర్:**చందానగర్ ఖజానా జ్యుయలరీస్ లో దోపిడీకి యత్నించిన దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు బీహార్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. నిందితుల నుంచి తుపాకీలతో పాటు తూటాలను కూడా పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. పక్క రాష్ట్రంలో జ్యుయలరీ దుకాణంలో పాల్పడిన నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఫైరింగ్ చేసిన వారిని కూడా గుర్తించామని తెలిపారు. దీపక్, ఆశిష్ అనే నిందితులు బీహార్ లో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు.

**అనేక రాష్ట్రాల్లో....**

ఈ బీహార్ గ్యాంగ్ పై అనేక రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. బీహార్ తో పాటు మహారాష్ట్ర వంటి చోట్ల నేరాలకు పాల్పడ్డారని చెప్పారు. రెక్కీ పక్కాగా చేయడంతో పాటు జ్యుయలరీ దుకాణాలను మాత్రమే టార్గెట్ చేసే వారు. చందానగర్ జ్యుయలరీ దుకాణంలోనూ అలాగే రెక్కీ నిర్వహించారు. బీహార్ కు చెందిన ఆశిష్, దీపక్ లను అరెస్ట్ చేశామని పోలీసులు వివరించారు. దొంగల నుంచి గోల్డ్ కోటెడ్ జ్యుయలరీని కూడా స్వాధీనం చేసుకున్నామని




పోలీసులు తెలిపారు. బీహార్ గ్యాంగ్ అయినా వీరు ఇక్కడే ఉండి చోరీ చేసిన బంగారాన్ని విక్రయించేందుకు సిద్ధమవుతారని పోలీసులు తెలిపారు.

**కర్ణాటకకు వెళ్లి అక్కడి నుంచి...**

అయితే తెలివిగా వీరు ఖజానా జ్యుయలరీలో దోపిడీకి ప్రయత్నించిన తర్వాత వెండి సామాన్లతో రెండు ద్విచక్ర వాహనాలపై కర్ణాటక రాష్ట్రం వెళ్లినట్లు పోలీసులు గమనించి అందుకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలించారు. అక్కడి నుంచి ఆరుగురు విడివిడిగా వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. అయితే దోపిడీకి పాల్పడిన వారిలో ఇద్దరిని పూణేలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్ జ్యుయలరీ దుకాణాలు తెరిచెని వెంటనే, అలాగే దుకాణం మూసే సమయంలోనే దోపిడీకి పాల్పడటం అలవాటు అని పోలీసులు తెలిపారు.

# సరిహద్దు వివాదాలపై.. ఆగస్టు18న భారత్‌లో చైనా విదేశాంగ మంత్రి పర్యటన



**హైదరాబాద్ పెన్ పవర్:**చైనా, భారత్ మధ్య స్నేహబంధం చిగురిస్తోందా.. ఇటీవల ట్రంప్ పన్నులతో విసిగిపోయిన భారత్ పొరుగు దేశం చైనాకు స్నేహహస్తం అందిస్తోంది. ఆగస్టులో చివరి వారంలో ప్రధాని మోదీ చైనాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో సోమవారం (ఆగస్టు18) చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్ లో పర్యటించనున్నారు. రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న సరిహద్దు సమస్యపై చర్చించనున్నారు. సోమవారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్ కు రానున్నారు. భారత విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తో చర్చలు జరపనున్నారు. 2020 తర్వాత తూర్పు లడఖ్‌లో ఉద్రిక్తలు పరిస్థితులను సాధారణస్థితికి తీసుకొచ్చే న్యూఢిల్లీ బీజింగ్ ప్రయత్నాల మధ్య ఈ పర్యటన ప్రాముఖ్యతను కలిగి ఉంది. చైనా రాయబారి పర్యటనను భారత్ లోని చైనా రాయబార కార్యాలయం ధృవీకరించింది. ఆగస్టు 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్ లో పర్యటిస్తారని Xలో పోస్ట్ షేర్ చేసింది. భారత ఆహ్వానం మేరకు సరిహద్దు సమస్యపై చైనా,భారత్ ప్రత్యేక ప్రతినిధుల మధ్య 24వ రౌండ్ చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.

2020 తర్వాత భారత్ చైనా సరిహద్దు ప్రాంతం లడ్డాఖ్ లో ప్రతిష్టంభన చోటు చేసుకుంది. ఇటీవలి నెలల్లో రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించడానికి చర్యలు చేపట్టాయి. గతేడాది లడ్డాఖ్‌లో ఘర్షణను తగ్గించేందుకు భారత్, చైనా పాక్షిక ఒప్పందానికి వచ్చాయి. ఈ ఏడాది ప్రారంభంలో చైనా కైలాష్-మానసరోవర్ యాత్రను తిరిగి ప్రారంభించింది. మరోవైపు భారతదేశం చైనా పర్యాటకులకు వీసాలు జారీ చేసింది. రెండు దేశాలలోని పరిశీలకులు వాంగ్ పర్యటనను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇది రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

## ఆదిలాబాద్‌లో చూస్తుండగానే వరదలో కొట్టుకుపోయిన కారు!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న కుండపోత వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ క్రమంలో ఓ వ్యక్తి వరద ఉద్ధృతిని తక్కువగా అంచనా వేసి కారుతో రోడ్డు దాటే ప్రయత్నం చేయగా, అది నీటిలో కొట్టుకుపోయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. అయితే, అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది.గత కొన్ని రోజులుగా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. రహదారులన్నీ చెరువులను తలపిస్తూ జలమయమయ్యాయి. ఈ నేపథ్యంలో, కోజా కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన కారులో బయటకు వచ్చాడు. కాలనీలోని రోడ్డుపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ, దాన్ని దాటేందుకు ప్రయత్నించాడు.కొంత దూరం వెళ్లాక వరద ప్రవాహం తీవ్రం కావడంతో కారు ముందుకు కదలలేక నీటిలోనే నిలిచిపోయింది. పరిస్థితి ప్రమాదకరంగా మారుతోందని గమనించిన ఆ వ్యక్తి, వెంటనే అప్రమత్తమై కారు దిగి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాడు. అతను బయటకు వచ్చిన కొద్ది క్షణాల్లోనే, వరద ఉద్ధృ తికి కారు కాస్తా కాగితపు పడవలా కొట్టుకుపోయింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## ముంబైని ముంచెత్తుతున్న భారీ వర్షాలు..విక్రోలీలో విరిగిపడ్డ కొండచరియలు

**హైదరాబాద్ పెన్ పవర్:**భారీ వర్షాలు ముంబైని ముంచెత్తుతున్నాయి.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం( ఆగస్టు16) వరదలు ముంబైని అతలాకుతలం చేశాయి. వీధులు, రోడ్లపై భారీ ఎత్తున వరద నీరు నిల్చిపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. విక్రోలీ పార్క్ సైట్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఇద్దరు చనిపోయారు.. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. శనివారం భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మరోవైపు భారీ వర్షాలతో లాతోర్ జిల్లా వణికిపోతోంది. జిల్లాలో టెర్నా, మంజారా నదుల ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వరద ముంపు ఉన్నందున నది పరివాహక ప్రాంతంలో ప్రజలు వెంటనే ఖాళీ చేయాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.లాతూర్ జిల్లాలో శనివారం (ఆగస్టు 16) సాయంత్రం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (%×వీణ%) రెడ్ అలర్ట్ జారీ జారీ చేసింది. ఆగస్టు 16, 2025న తెల్లవారుజామున 1 గంటల నుంచి4 గంటల మధ్య ముంబైలో అత్యంత భారీ వర్షపాతం నమోదైంది.పశ్చిమ ,తూర్పు శివారు ప్రాంతాలు అత్యధికంగా దెబ్బతిన్నాయి. పశ్చిమాన మరోల్ ఫైర్ స్టేషన్ లో 207 మిమీ,నారియల్వాడి స్కూల్, శాంటాక్రూజ్ 202 మిమీ వర్షపాతం నమోదు అయింది. తూర్పున ఠాగూర్ నగర్ స్కూల్, విఖ్రోలి 196 మిమీ , బిపి ఆఫీస్, విఖ్రోలి195 మిమీ లవర్షం కురిసింది. ముంబైలోని కింగ్స్ సర్కిల్‌లో భారీ వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జన్ కళ్యాణ్ సొసైటీలో కొండచరియలు విరిగిపడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

# కోమటిరెడ్డి నోటికి కళ్లెం వేయడం ఎలా? కాంగ్రెస్ నాయకత్వం మల్లగుల్లాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలో ఫ్రస్టేషన్ పీక్స్ కు చేరుకున్నట్లు కనిపిస్తుంది. తనకు మంత్రి పదవి దక్కకపోవడానికి అసలు కారణం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని గట్టిగా భావిస్తున్నారు. కాంగ్రెస్ లో చేరిందే ఆయన మంత్రి పదవి కోసం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తనకు ఖచ్చితంగా మంత్రి పదవి దక్కుతుందని గట్టిగా ఆశించారు. అందులోనూ కాంగ్రెస్ హైకమాండ్ తనకు అనుకూలంగా ఉందని ఆయన నమ్మి భారతీయ జనతా పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చి చేరారు. 2018 ఎన్నికల్లో మునుగోడు ఎన్నికల్లో గెలిచినా తర్వాత కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయాలను నిరసిస్తూనే ఆయన పార్టీ పదవికి రాజీనామా చేశారు. బీజేపీలో చేరి తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేసినా గెలవలేకపోయారు. దీంతో ఆయన 2023 ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిపోయారు.

**తొలి విడత ఆశించినా...**

అయితే తొలి విడత మంత్రివర్గం ఏర్పాటు సమయంలోనే తనకు మంత్రి పదవి వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశించారు. కానీ మరో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉంచడంతో మలి విడత మంత్రి పదవి వస్తుందని భావించారు. ఢిల్లీకి వెళ్లి తన పరిచయాలను ఉపయోగించి లాబీయింగ్ చేసుకుని మరీ వచ్చారు. తనతో పాటు బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన గడ్డం వివేక్ తో పాటు తనకు కూడా మంత్రి పదవి దక్కుతుందని భావించారు. ఆఫ్ ది రికార్డుగా మాట్లాడుతూ తనకు హోం మంత్రి పదవి అంటే ఇష్టమని కూడా ఆయన వ్యాఖ్యానించారంటే మంత్రి పదవిపై ఎంత మక్కువో ఇలా చెప్పకనే అర్థమవుతుంది. అయితే అదే సమయంలో సీనియర్ నేత జానారెడ్డిపై కూడా ఆయన ఆరోపించారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుపడుతుంది జానారెడ్డి అని ఆయన కుండబద్దలు కొట్టి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.


**మలి విడతలోనూ...**

అయితే మలి విడతలోనూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదు. కానీ ఆయనతో పాటు బీజేపీ నుంచి కాంగ్రెస్ లో చేరిన గడ్డం వివేక్ కు మంత్రి పదవి వరించింది. ముగ్గురికి మాత్రమే అవకాశం ఇచ్చింది. దీంతో ఆయన ఒకింత ఆగ్రహానికి గురయ్యారు. గత కొంతకాలంగా ఫ్రస్టేషన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు ప్రస్తావించకుండా విమర్శలు చేస్తున్నారు. ట్వీట్లు కూడా పెడుతున్నారు. కానీ తాజాగా రేవంత్ రెడ్డిపై విమర్శలను నేరుగా చేస్తున్నారు. బిల్లుల చెల్లింపులలో వివక్ష చూపుతున్నారంటూ ఆరోపించారు. పదవులు మీకే..పైసలు మీకేనా...అంటూ నిష్టూరమాడారు. పదవులు తీసుకోండి.. కానీ పనులు చేసిన కాంట్రాక్టర్లకు పైసలు ఇవ్వండి..అంటూ మా మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దంటూ వ్యాఖ్యానించారు. ఇంతకుముందువరకూ రేవంత్ రెడ్డి పేరు ఎత్తకుండా విమర్శలు చేసిన రాజగోపాల్ రెడ్డి ఈ సారి మాత్రం నేరుగా ఆయన పేరు ప్రస్తావించి మరీ విమర్శలు చేయడం అధికార పార్టీలో చర్చనీయాంశమైంది.

**మంత్రి పదవి దక్కదని...**

దీన్ని బట్టి చూస్తే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇక నేరుగా వార్ కు సిద్ధమయినట్లే కనిపిస్తుంది. కాంగ్రెస్ హైకమాండ్ తనకు మంత్రి పదవి ఇవ్వకపోవచ్చన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు కనిపిస్తుంది. అందుకే ఏది ఏమైనా.. హైకమాండ్, పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నప్పటికీ అన్నింటికీ తాను సిద్ధంగానే ఉన్నట్లు ఆయన కనపడుతున్నారు. అందుకే తెగించి మాట్లాడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నేతలే చెబుతున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా ఆ వ్యాఖ్యలను పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన మీడియాకు చెప్పారు. అయితే క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయం కాదన్నది అందరికీ తెలుసు. ఇది పార్టీ హైకమాండ్ తీసుకోవాల్సిన నిర్ణయం. అది తేలాలంటే మరోమూడేళ్లు గడిచిపోవాల్సిందే తప్ప ఎటువంటి చర్యలుండవన్న ధీమా కోమటిరెడ్డి అనుచరుల్లో కనపడుతుంది. తర్వాత రాజెవరో? ఏమో? అన్న రీతిలో ఉంది.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు ఎప్పుడంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెలలోనే మరొక కీలకమైన పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రారంభ కార్యక్రమం ఈ నెలలోనే చేయనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. శ్రావణ మాసం కావడంతో పాటు శుభముహూర్తాలు ఉండటంతో పూర్తయిన ఇళ్లను ప్రారంభించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఎన్ని ఇళ్లు పూర్తియినా సంఖ్యా పరంగా కాకుండా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల పండగను ఈ మాసంలోనే జరపాలని ఇటు అధికారులకు, అటు మంత్రులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది.

**మూకుమ్మడిగా...**

ఇందులో భాగంగా గృహనిర్మాణ శాఖ అధికారులు వేగంగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసే పనిలో ఉన్నారు. కొంచెం వర్షం వల్ల ఆలస్యమవుతున్నప్పటికీ అనుకున్న సమయానికి గృహప్రవేశానికి వీలుగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలంటూ ఇప్పటికే హౌసింగ్ శాఖకు చెందిన అధికారులు లబ్దిదారులను కోరుతున్నట్లు తెలిసింది. అవసరమైన బిల్లులను వెంటనే చెల్లిస్తామని, నగదు కోసం వేచి చూడకుండా ఇళ్లకు రంగులు వేసుకోవడం వరకూ పూర్తి చేసి సిద్ధం చేసుకోవాలని లబ్దిదారులను ఆదేశించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చేతులు మీదుగా కొన్ని ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాల పండగను చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం అధికారులు యుద్ద ప్రాతిపదికపై పనులు పూర్తి చేస్తున్నారు.

**నాలుగు వేల వరకూ...**

శ్రావణమాసం పూర్తి కావస్తుండటంతో మహిళలకు అత్యంత ఇష్టమైన సొంత ఇంటి కలను నెరవేర్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుంది. ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించేందుకు వీలుగా నిర్మాణాలను పూర్తి చేసి సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ, మండలం బెండలపాడులో రేవంత్ రెడ్డి పూర్తయిన ఇళ్లను ప్రారంభిస్తారని ప్రాథమికంగా అందుతున్న సమాచారం. ఇక మిగిలిన ప్రాంతాల్ల పూర్తయిన వాటిని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ లబ్దిదారుల చేత గృహప్రవేశాలు చేయించి ఆ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు నాలుగువేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉండటంతో ఈ నెల 21వ తేదీన ముహూర్తంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈలోపు అన్ని హంగులు పూర్తి చేసి రంగులు అద్ది ఇళ్లను సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెబుతున్నారు